


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 16 డిసెంబర్, 2019 సంచిక : 7



**సంస్థాపకులు :**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**

**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**

**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**

**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**


**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-

ఆజీవ సభ్యత్వం ......... రూ॥1000/-


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, బొమ్మల రామవరం మండలం,

యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.

**Ph : 9440413455, 9848133565**


**Online Donations :**

**SRI SAI SEVA SAMITHI TRUST**

**A/c No.62002652136**

**SBI Keesara Branch,**

**IFSC Code: SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి ........ 2

స్వరాంజలి ........ 6

సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 7

సంసారే కింసారం ........ 11

శ్రీ దత్త శక్తి మహాయాగము ........ 15

చాలునే నిద్ర ........ 17

గురు కృప ........ 18

పెద్దపులి బారి నుండి ........ 21

సాయిభక్త దాసగణు ........ 24

మాతృసంస్థ కబుర్లు ........ 27

సత్సాంగత్యం ........ 30



ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ప్రియ సాయిబంధువులందరికీ నమస్కారం.

ఆ మధ్య ఒక పల్లెటూళ్లో ఒక సమావేశానికి వెళ్లడం జరిగింది. ఊరు చిన్నది. పెద్దగా చదువుకున్న వాళ్ల సంఖ్య తక్కువ. ప్రైమరీ స్కూలు ఉన్నది. హైస్కూలుకు పొరుగూరికి వెళ్లవలసిందే. అలాంటిచోట ఒక పాతిక మంది పిల్లల్ని-పది, పదిహేను సంవత్సరాల మధ్య వయస్సు వారిని దొరక బుచ్చుకొని, కబుర్లు మొదలుపెట్టాను. ఒక అరగంట గడిచేసరికి నాకు ఆశ్చర్యం వేసింది. ఆ పిల్లల్లో జీవితం పట్ల, మన సంస్కృతీపరమైన విషయాల పట్ల ఎంత చక్కని అవగాహన! రామాయణ, భారత, భాగవత కథల మీద ఎంచక్కని అధికారం! ఈ మారుమూల పల్లెల్లో ఈ పిల్లలకు ఇవన్నీ ఎలా వచ్చాయి? దాని మీద కొన్ని ప్రశ్నలు వేసి తరచి చూడగా రెండు, మూడు జవాబులు దొరికాయి. "నాకు నచ్చినవి" - ఒకటి - ఆ ఊళ్లో నాలుగైదు మామూలు టీ.వి.లు తప్ప మల్టీ ఛానల్స్ ఉన్న టీ.వి.లు లేవు. రెండు-ఆ పిల్లల అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు వాళ్ల ఇళ్లల్లోనే ఉంటున్నారు. ఊళ్లో యింకా హరికథలు, పురాణాలు చెప్పించే అలవాటు, వినే అలవాటు బ్రతికే ఉన్నాయి. ఈ అన్నింటి సమాహారమే పిల్లల్లో వివేకం.

వాళ్లలో కూడా వయోసహజమైన చాపల్యం, కొంటెతనం ఉన్నాయి. కానీ, ఏదైనా శ్రద్ధగా వినే అలవాటు ఉంది. నేర్చుకోవాలన్న ఆసక్తి ఉంది. ప్రశ్నలు వేయగల నేర్పు ఉంది. చర్చించగల ఓర్పు ఉంది. ఇవన్నీ టీ.వి చూడటం వలనా, హరికథలు వినటం వలనా మాత్రమే రావే! అక్కడ వినడమేగానీ, ప్రశ్నించే అవకాశం లేదు గదా! కేవలం వాళ్లకు బాగా

చనువైన అమ్మమ్మలు, తాతయ్యల దగ్గరనే పిల్లలు ప్రశ్నించగలరు, వాదించగలరు. మరి-ఏరీ ఆ వృద్ధమూర్తులు?

మారుతున్న కాలగతిలో ఉమ్మడి కుటుంబాలు మాయమైపోయాయి. పంచుకున్న గిన్నె, చెంబు, తెపాళాలతోపాటు, ఆస్తిపాస్తులతోపాటు యీ వృద్ధ బంధువులైన తల్లిదండ్రులను కూడా పంచుకొనే ప్రయత్నం చేస్తున్నారు పిల్లలు. ఒకవేళ ఏకైక పుత్రుడై ఇంట్లో ఉంచుకున్నా, వాళ్లు తమ పిల్లలకు అన్నీ పాత చింతకాయ పచ్చడి కబుర్లే నేర్పుతారన్న తేలికదనం కూడా కొందరిలో ఉంటుంది. ఇంటర్‌నెట్ల జీవితాలు తప్ప ఇంటి వారితో జీవితాలు కరువవుతున్న యీ రోజుల్లో యిలాంటి సంస్కృతీపరమైన, ఆధ్యాత్మికపరమైన ప్రబోధాలు ఎలా అందాలి. ఆ గ్రామీణ బాలలకులాగా మన నాగరిక బాలలకు?

తాము పిల్లల అధునాతన భావాలతో సరిపెట్టుకొని కలవలేకనో, ఆర్థిక ఇబ్బందుల వలననో బయటకు వచ్చి వృద్ధాశ్రమాలలో తలదాచుకొంటున్న వృద్ధులు మహానగరాలలోనే కాదు-విజయవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖ వంటి పట్టణాలలో కూడా లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. వాళ్లంతా కాకపోయినా, కొంత ఓపిక, చైతన్యం ఉన్న వారైనా ఈ మహత్కార్యం కోసం పూనిక వహించవచ్చు. లేని ఆనందాలను తలుచుకొని దుఃఖించడం అవివేకం. ఊరికే వృద్ధసమ్మేళనాలు, ఆటల పోటీలు నిర్వహించుకొంటూ, ఏదో కాలక్షేపం చేస్తూ ఉండే బదులు తమ విద్యా విజ్ఞానాలను, అనుభవసారాన్ని భావితరం కోసం ఉపయోగిస్తే మన సమాజానికి ఎంతో మేలు కలుగుతుంది. అందుకు పెద్దగా ఏమీ కష్టపడనక్కరలేదు కూడా. అయ్యో! పెద్దలారా, ఆశ్రమానికి చుట్టుప్రక్కల ఉన్న ఒకటి రెండు ఆకాశహర్మ్యాలను ఎంచుకోండి. ఓ ఇరవై, ముప్పై గుడిసెలు దొరికితే మరీ మంచిది. ఎక్కువమంది పిల్లలుంటారు. వాళ్లందరినీ పోగు చేసుకొని ఏదో ఒక అపార్టుమెంటు, సెల్లార్‌లోనో కూర్చోబెట్టుకోండి.





ఓంకారం మూడుసార్లు, ఓ చిన్న శ్లోకం పదిసార్లు పలికించండి. అటుపైన రామాయణ కథో, మహాభారత కథో రోజూ కాస్త చొప్పున చెప్పండి. పిల్లలకు హనుమంతుడు, శ్రీకృష్ణుడు, భీముడు, కర్ణుడు-ఇలాంటి పాత్రలు బాగా నచ్చుతాయి. అలా ఒక్కొక్కళ్ల కథ సప్తాహంలాగా చెప్పినాగానీ ఎంచక్కా వింటారు. మర్యాద రామన్న, నసీరుద్దీన్, తెనాలి రామకృష్ణుడు-ఇలాంటి వారి కథలు కూడా పిల్లలకు ప్రాణం. అలాగే దేశభక్తుల కథలు, సాహసంతో దేశరక్షణలో పాల్గొన్న వీరులు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వీర యువకులు, ఝాన్సీలక్ష్మీబాయి, రుద్రమదేవి లాంటి వీరవనితల గాథలు వాళ్లకు బాగా నచ్చుతాయి. అంచేత దేశ చరిత్రలో నుంచీ మంచి విషయం ఒకటి ఒకరోజు చెప్తే, రామాయణం లోంచీ ఓ కథ మరునాడు చెప్పండి. వారమంతా ఒకే శ్లోకం, వీలైతే ఒక పద్యం చెప్పవచ్చు. మీ చిన్ననాడు గ్రామాలెలా సుసంపన్నంగా ఉండేవో, ప్రజల తీరు, ఆచారాలు, అలవాటు సరదాగా చెప్పండి. తాతల నాటి కబుర్లు వినటం మనకైనా సరదాయే గదా-ఇక పిల్లలకుండదా! అసలు ఆ మాట కొస్తే - మీ చిన్నప్పటి ఏడుగురు రాజకుమారులు - ఎండని చేప, ఇల్లలుకుతూ పేరు మర్చిపోయిన ఈగ, చీమ-గొల్లభామ-యిలాంటి కథలు కూడా వాళ్లకు తెలియవు - ఒట్టు!

మాతృదేశ గౌరవాన్ని ప్రతిబింబించే సంఘటనలు. 'డే టు డే లైఫ్' లోంచీ కూడా కొన్ని యివ్వవచ్చు. వాళ్ల చదువు మీద ఏకాగ్రత, అభిమానం, పోటీ, సహజత్వం చచ్చిపోనివ్వకుండానే మాతృభాషాభిమానం, స్వావలంబనం, నలుగురినీ కలుపుకుపోవటంలాంటి వ్యక్తిత్వ వికాస దోహదకారులైన విషయాలు చెప్పవచ్చు. ఇవన్నీ వాళ్లను స్వేచ్ఛగా ప్రశ్నలడగనిస్తూ వాళ్లను చర్చకు ఆహ్వానిస్తూ, వాళ్లను రెండు భాగాలుగా విడగొట్టి, వాళ్ల మధ్య పోటీ పెడుతూనే సుమా! క్లాస్‌రూపం వాతావరణం రానివ్వకూడదన్నది ముఖ్యం.

'ఆఘ్రాణించు-గుర్తించు', 'తాకి చూడు-పేరు చెప్పు' లాంటివి, ఫేషన్స్ టెస్ట్ (నీ ఓర్పు నువ్వు చూచుకో), 'జ్ఞాపకానికో సవాల్' లాంటివి ఓ ఇరవై ఆటలైనా 'ఉన్నచోటులోనే కూర్చోబెట్టి ఆడించగలవి ఉన్నాయి. అవి చురుకు దనాన్ని, వినికిడి శక్తినీ, పరిశీలనా శక్తినీ కూడా పెంచుతాయి. ఇలాంటి ఆటల వలన పిల్లలు మీకు బాగా సన్నిహితులౌతారు కూడా. అలా ఒక్క ఆరు నెలలపాటు ఒక సెట్ పిల్లల్లో సంస్కారాలు నాటే ప్రయత్నం చేయండి. మీకెంత ఆనందం కలుగుతుందో చూడండి. మర్చిపోకండి సుమా-మీరు కొందరు భావిపౌరులలో మానవతా విలువలు, దేశ భక్తి, ఆధ్యాత్మికత, కలిసి ఎదగటం - యిన్నింటికి చక్కని బీజారోపన చేయగలిగారు. ఎంత గర్వం! ప్రొద్దువాటారేప్పుడు కూడా ఆ పిల్లల మనోభావాల ద్వారా మళ్లీ ఉదయం సూర్యులమే అవుతున్నాం, ధన్యులమయినట్లు కాదూ!

పై పనులకు కొన్ని ఆటంకాలు, పెద్దల నుంచీ కొన్ని అభ్యంతరాలు కూడా ఎదురవుతాయి. ప్రతిరోజూ యిదేం గోల? మా పిల్లలు ట్యూషన్లకు వెళ్లే వేళ యిది అనేవాళ్లు కొందరైతే - మా పిల్లలు డాన్స్ క్లాస్‌కి వెళ్లాలి. కరాటే క్లాసుకు వెళ్లాలి అనే వాళ్లు ఇంకొందరు. ఆ పిల్లల్లో విధర్మీయులుంటే అదో గోల! అలాంటి చోట వారానికి మూడు రోజులే ఉంచుకోండి. (ఆది వారం మాత్రం తప్పకుండా ఉండాలి సుమా!) పిల్లల్లో క్రమంగా వికసిస్తున్న సంస్కారాలు, మారుతున్న మాట తీరు, మెల్లగా పెరుగుతున్న క్రమశిక్షణ గమనించాక ఆ తల్లిదండ్రులే మిమ్మల్ని ప్రోత్సహిస్తారు. ఇక మీ చుట్టూ మనుమళ్ళూ, మనమరాళ్లే. మీరు స్త్రీలైతే రకరకాల ముగ్గులు నేర్పి ఒకరిద్దరు తల్లులను కూడా అందులో దింపి చూడండి.

తల్లులారా, తండ్రులారా! మీరంతా కోప్పడకుండా నా మాటల్లో నిజా నిజాలు ఆలోచించండి. ఈ దేశంలో పిల్లలు ప్రస్తుతం నూటికి 90 మంది తల్లిదండ్రులున్న అనాధలు. పిల్లల శరీరాల పోషణకు లోటు లేదు. అలం కరణలకు లోపం లేదు. వినోదాలు, వీడియో గేములకు, ఇంటర్‌నెట్





ఛాట్‌లకు కూడా కొదవలేదు. మెదడుకు పనికొచ్చేవి చదువు ఇస్తోంది. శరీరాలకు తల్లిదండ్రులిస్తున్నారు. హృదయాలను వికసింపజేసేవీ, ఆత్మను శుద్ధంగా ఉంచేవీ ఏవీ? వాళ్ల బాల్యాన్ని సజీవంగా ఉంచేవి ఏవీ? మనకు తీరిక లేదు. ఉద్యోగాల యంత్రాలలో నలిగిపోయే జీవితాలు మనవి. అంచేత-వృద్ధ మాతలూ, పితృదేవులూ మన జాతికి కావలసిన సత్పౌరులను తయారుచేసే యీ సత్కార్యం చేపట్టండి. జాతిని రక్షించండి. నమస్కారం.

# స్వరాంజలి

**- బి.సులోచన**

పరమ పావనమైన గురుదేవ పదములు
పట్టి భజియింపవే మనసా ॥
పరతత్వమును గొని మరల జన్మకు రాని!
పదములూ చేర్చవే మనసా ॥ ॥ ప ॥

పరిపరీగతులనూ పరుగెత్తుచూ నీవు
గురు మహిమ మరువకే మనసా ॥
స్థిరమిదే అనుకోకు పరులనూ నమ్మకూ
గురుసేవ విడువకే మనసా ॥ ॥ ప ॥

మరువకు ఎప్పుడూ గురుదేవుడొక్కడే
పరమ బంధువుడగునె మనసా ॥
శరణు శరణనుచునూ స్మరణ
మాత్రముననే కరుణ కురుపించునూ మనసా ॥ ॥ ప ॥

వరములాసించుకుమ సిరిసంపదలు స్థిరమా
పరతత్వమును గనుము మనసా ॥
పరమ పావనమైన సద్గురుని చేరి
ఆనంద మొందవే మనసా ॥ ప ॥

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

విన్నీ తరచు అమెరికా నుండి షిరిడీకి వచ్చి సాయినాథుని మరియు స్వామీజీ చెంత తన తండ్రిని ఆరోగ్యవంతునిగా చేయమని ప్రార్థించెడిది. ఆ సమయంలో స్వామీజీ రామలింగ స్వామి విరచితమైన 'అంబ్రోషియా ఇన్ షిరిడీ' పుస్తకమునిచ్చి "అందరికి అర్థమగు రీతిలో సులభశైలిలో వ్రాయుము" అని ఆజ్ఞాపించెను. 1987 సం. నవంబరు మాసములో ప్రభు స్వర్గస్తులాయెను. ఆ విచారములో విన్నీ స్వామీజీ చెప్పిన మాటలను ఏ విధముగా అమలుపరచవలెనాయని ఆలోచించసాగెను. ఈమె 1994 సంవత్సరములో అమెరికా నుండి తిరిగి వచ్చి షిరిడీలో స్థిరనివాసమేర్ప రచుకొని సాయి సేవకే తన జీవితమును అంకితమొనరించెను.

ఇంతకు పూర్వము ఏ విధమైన రచనానుభవము లేకపోయినను 2000 సంవత్సరములో 'అంబ్రోషియా ఇన్ షిరిడీ' గ్రంథమును కలర్ ఫొటోలతో సులభశైలిలో అత్యంత సుందరముగా రచించి ప్రచురించెను. మహనీయుల వాక్కులెన్నటికి వృధాపోవని ఈ సంఘటన స్పష్టము చేయు చున్నది గదా! ఈ గ్రంథము బెంగుళూరులో ఆవిష్కృతమైన రోజునే వెయ్యి ప్రతులు అమ్ముడుపోవుట ఈ గ్రంథము యొక్క ప్రాశస్త్యమును తెలియకనే తెలియజేయుచున్నది. ఈ గ్రంథము హిందీ, కన్నడ మరియు తెలుగు భాషలలోనికి కూడ అనువదించబడెను. సాయినాథుని మరియు స్వామీజీల ఆశీర్వాద ప్రభావము వలన దీనిని తెనింగించు అదృష్టము నాకు లభించినది. ఈ గ్రంథములో షిరిడీలోని ముఖ్య దేవాలయములు పూర్తి వివరములతో ఛాయా చిత్ర సహితముగా ముద్రించుటచే షిరిడీని దర్శించే భక్తులకు ఇది మార్గదర్శిగా సుపయోగపడుచున్నది. అటుపిమ్మట





"అంబ్రోషియా ఇన్ షిరిడీ" రెండవ భాగమును కూడ విన్నీ రచియించి ప్రచురించెను. ఇందులో బాబా మహాసమాధికి పూర్వము జరిగిన లీలలు (సచ్చరిత్ర యందు పొందుపరచనవి) పూర్తి వివరములతో వర్ణించబడెను.

ప్రస్తుతము విన్నీ షిరిడీకి సమీపమున గల కోర్హాలా గ్రామమున బాబా మందిరమును నిర్మించి ఆ మార్గమును వచ్చు బాబా పల్లకీలను తెచ్చు భక్తవరేణ్యులకు అన్ని విధముల సహాయ సహకారములందించుచుండెను. షిరిడీలో జరుగు ప్రధాన ఉత్సవముల సమయమును పల్లకీలు అధిక సంఖ్యలో తెచ్చు భక్తుల అవసరార్థమై ఉచిత వైద్య సేవలందించుట, భక్తులకు వసతి, ఆహార పానీయములు సమకూర్చుచుండెను. ఈ సమయమందే విన్నీకి మాతృ వియోగము సంభవించెను. అట్టి విపత్కర సమయమునందు కూడా బాబా ప్రచారమును నిరంతరము కొనసాగిం చుచుండెను. ఇదంతయు బాబా, స్వామీజీలే నా చేత చేయించుచున్నా రని సవినయముగా తనను ప్రశ్నించిన వారికి విన్నవించును.

స్వామీజీకి బాబా ఛాయాచిత్రములో అగుపించిన మూడవ వ్యక్తి ఎవ్వరైనదీ స్వామీజీ వివరించలేదు.

స్వామీజీ యొక్క నిస్వార్థ సాయి సేవను, భక్తి తత్పరతలను గుర్తించి నాటి షిరిడీ సాయి సంస్థాన్ కోర్టు రిసీవర్ చావడి బాధ్యతను స్వామీజీకి అప్పగించారు. ఆ రోజుల్లో చావడిని గురువారం మాత్రమే ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంచేవారు. ప్రతి గురువారం చావడి తెరచి శుభ్రం చేసి ఎంతో అందంగా భక్తుల హృదయాలను అలరించే రీతిన అలంకరించి అచటకు వచ్చిన భక్తులకు సాయి లీలలను వివరించి వారికి బాబా పై గల భక్తి విశ్వాసాలను పెంపొందించేవారు. చావడి తెరచి ఉన్నంతసేపు అచటనే ఆశీనులై చావడిని అత్యంత పరిశు భ్రముగా నుంచెడివారు. ఎంతో శ్రద్ధాభక్తులతో చావడి బాధ్యతను నిర్వ

ర్తించుచున్న స్వామిని అందరు 'చావడి బాబా'యని పిలవసాగిరి. స్వామీజీ చావడి బాధ్యతను అత్యంత బాధ్యతాయుతముగను, భక్తి శ్రద్ధలతో నిర్వహించుట గాంచిన కోర్టు రిసీవర్ భక్తులకు పంపే బాబా ప్రసాదం కవర్లపై చిరునామాలు వ్రాసే పనిని కూడ స్వామికి అప్పగించి అందుకుగాను నెలకు రూ.15/- గౌరవభృతిని కూడ ఏర్పాటు చేసి స్వామీజీకి ద్వారకామాయిలో పల్లకి గదికి ప్రక్కనే గల గదిలో నివసించటానికి అనుమతి నొసంగెను. "ద్వారకామాయి ప్రవేశమే సర్వ దుఃఖ పరిహారము"ని బాబాయే స్వయముగా నుడివెను. మసీదుమాయి బాబా పాదస్పర్శతో అణువణువు పావనమై సాక్షాత్తు పరబ్రహ్మయైన సాయినాథుని తన అక్కున చేర్చుకొని సాయిలీలను కనులారగాంచి మనసార ఆస్వాదించి సాయి లీలకు సాక్షీభూతమై అందరికి అమ్మయై అలరారుచున్నదీ ద్వారకామాయి. సకల ప్రాణికోటిని ఉద్ధరించునదే ఈ ద్వారకామాయి. సర్వమత సమ్మేళనానికి ఒక ప్రతీక ఈ ద్వారకామాయి. కుల మతాలకతీతమై అందరిపై ఆప్యాయానురాగాలు కురిపించుచు బాధా తప్త మానవులకు ఇదొక మానస సరోవరము. ఇందడుగిడిన ప్రతి వ్యక్తి తన ఉనికినే మరచి మరో ప్రశాంత ప్రపంచంలో అడుగిడిన అనుభూతికి లోనగును. సాయినాథుడు స్వహస్తములతో ప్రజ్వలింపజేసిన ధుని మాత కూడ ఇందుగలదు. హిందువులకు ఆరాధ్యనీయమైన తులసి బృందావనము, మహమ్మదీయులకు పరమ పవిత్రమైన నింబారు, బాబా ఆశీనుడైన శిల మొదలగునవి ఎన్నిటికో నిలయమై ఈ ద్వారకామాయి షిరిడీలో ముఖ్య మందిరమై విరాజిల్లు చున్నది. ఇంతటి మహిమాన్విత మందిరము ప్రపంచములో మరెక్కడా కానరాదు. సర్వ మానవులకు ఆరాధ్యనీయమైన మందిరములుండిన ఉండుగాక సర్వప్రాణులను ఉద్ధరించే మందిరము మాత్రము ఇలలో ఇదొక్కటే. ఇంతటి మహిమాన్విత మందిరములో నివసించు భాగ్యము బాబా మన స్వామీజీకి కల్పించాడంటే స్వామిపై సాయినాథుని కరుణా కటాక్షములు ఏ స్థాయిలోనున్నవో మన ఊహకందనివి. బాబా





స్వయముగా స్వామిని తన చెంతకు కోరి రప్పించుకుని ఇంతటి మహద్భాగ్యాన్ని కలిపించాడంటే అది స్వామి చేసుకున్న జన్మ జన్మల పుణ్య ఫలమే కాని వేరొకటి కాదు. స్వామీజీకి ముందుగాని స్వామీజీ మహాసమాధి చెందిన తరువాత గాని మరే భక్తునికి ఇంతటి సదవకాశము లభించలేదంటే స్వామీజీ ఎంతటి పుణ్య పురుషుడో, ఎంతటి భక్తాగ్రేసరుడో మనందరము గ్రహించి ఆయన అడుగుజాడలలో నడచిన మన జన్మ ధన్యమగుట తథ్యము. బాబా తన ప్రసాదమును స్వామికే చెందేలాగ చేసి, తాను నివసించిన ద్వారకామాయిలోనే నివాసమేర్పాటు చేసి అనంతమైన తన కరుణాకటాక్షములకు అవధులు లేవని నిరూపించుకొనెను.

స్వామీజీ సేవా తత్పరతను, నిరాడంబర, నిరంతర సాయి ప్రచారమును అసంఖ్యాక సాయి భక్తులు గుర్తించి మంచి విలువైన దుస్తులు, దక్షిణలు సమర్పించేవారు. స్వామికి సమర్పించిన ప్రతిదీ సాయికే చెందునని చాలా మంది సాయి భక్తులు ప్రగాఢంగా విశ్వసించేవారు. స్వామీజీ చేతిలో చిల్లి గవ్వ లేక ఆకలితో పస్తులున్న దినములను మరువక అటువంటి దుర్భర బాధ ఇతరులకు కలుగకూడదని తనకు లభించిన దక్షిణ మొత్తాన్ని అన్నదానానికి వినియోగించేవారు. సాయి భక్తులు తనకు సమర్పించిన విలువైన వస్త్రాలను బీదసాదలకు వితరణ చేసి తాను మాత్రము కొల్లాయి గుడ్డతోనే తన జీవితాన్ని కొనసాగించారు. సాయి తత్వాన్ని నరనరాన జీర్ణించుకుని సాయినాథుని అడుగుజాడలలోనే జీవనయానము సాగిస్తున్న స్వామీజీ బాబా వలెనె తనకు లభించిన దక్షిణ ధనమును ఏ రోజు కారోజే బీదసాదలకు దానము చేసి సాయంకాలమునకు రిక్త హస్తములతో మిగిలెడివారు. పైసాలోనే పరమాత్మను దర్శించే వారు కొందరు కాగా, ధనం కోసం ఇతరుల ప్రాణాలను తీసేవారు మరికొందరు. తరతరాలకు సరిపడినంత సంపాదించినా సంతృప్తి చెందనివారు ఇంకొందరు. శ్రమజీవులు శ్వేతబిందువులు చిందించి కట్టిన సౌధములలో సుఖ సౌఖ్యాలనుభవించుచు ఆ సౌధములను నిర్మించిన కూలీల శ్రమకు సరియైన కూలీ కూడ ఇవ్వని వారు మరికొందరు.

**(సశేషం)**

# సంసారే కింసారం?

(హిందూ ధర్మం నుండి)

- పరమపూజ్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర భారతీస్వాముల వారు

ఆచార్యుల వారు తమ ప్రశ్నోత్తర రత్నమాలికలో 'సంసారే కింసారం' (సంసారంలో ఏమి సారముంది?) అని ప్రశ్నించి, తామే సమాధాన మిచ్చారు. "ఇదే ప్రశ్న పదేపదే అడుగుతూ ఉండండి. దాని సారం అదే".

నేను పుట్టిన ప్రయోజనం ఏమిటి? ఎందుకు పుట్టాను? ఈ ప్రశ్న పదేపదే నిన్ను నీవు అడుగుతూ ఉండు. "నా జీవన లక్ష్యాన్ని చేరుతున్నానా? లేనా?" అని పదేపదే ప్రశ్నించుకోనాలి. మళ్లీ మళ్లీ మనం పాపాలెందుకు చేస్తాం-ఇది మనలో చాలామందిని ఇబ్బంది పెట్టే ప్రశ్న. కోపం ఎందుకు వస్తుంది? ఇదీ అదీ కావాలని కోరికలు ఎందుకు కలుగుతాయి? కోపం, కోరిక, పాపం లేకుండా హాయిగా ఆనందంగా ఉండలేమా? - ఈ ప్రశ్న లన్నిటికీ జవాబులు దొరకవు.

పువ్వు నుండి పిందె వస్తుంది. ఆ తరువాత ఎంతో కాలానికి పండు తుంది. కుసుమం పరిమళాలు వెదజిమ్మి ముక్కును ఆనందపరిస్తే, పండిన పండు రుచి నాలుకను సంతృప్తిపరుస్తుంది. ఫలమాధుర్యం అద్భుతంగా ఉంటుంది. అది పండక ముందు, తియ్యబడక ముందు ఎలా ఉండేది. పువ్వుగా చేదు, పిందెగా వగరు, కాయగా పులుపు, పండాక మాధుర్యం. శాంతి అంటే మాధుర్యం. శాంతి లభించగానే బంధాలన్నీ వాటంతట అవే విడిపోతాయి. హృదయం మాధుర్యంతో నిండగానే ఈ బంధాలన్నీ మాయమైపోతాయి. పులుపున్నంత వరకే బంధాలు. నీవు పచ్చికాయను చెట్టు నుండి తెంపినపుడు కాడలోనూ, కాయలోనూ





కూడా చెమ్మ ఉంటుంది. దాని అర్థం చెట్టు దాని నుండి విడివడాలను కోవడం లేదని. అలాగే కాయ కూడా విడిపోవాలనుకోవటం లేదనీను.

మాధుర్యం అంతటా నిండినపుడు బంధాలన్నీ పల్చబడిపోయి, పండు దానంతట అదే నేలకు రాలుతుంది. చెట్టే వదిలేస్తుందో, పండే విముక్త మౌతుందో-ఈ ఎడబాటు మాత్రం కన్నీటితో కాక ఆనందంతో జరుగు తుంది. అలాగే మానవుడు క్రమక్రమంగా పండులాగా మధువులొలికే స్థాయికి రావాలి. అత్యంత ఆనందంతో సంసార వృక్షం, జనన మరణ చక్రం నుండి విడిపోగలగాలి. కోరిక, కోపంలాంటివన్నీ పండటానికి ముందర చేదు, వగరు, పులుపు లాంటి దశలు. కోరికలు, క్రోధాలకు మనమే కర్తలైనపుడు వాటి నుండి తప్పించుకోలేము. కానీ ఈ దుఃఖాలకు, ఈ తపనలకు మనమెందుకు కర్తలం కావాలని పదేపదే ప్రశ్నించుకుం టుండాలి. ఈ ఫలానా కోరికలూ వగైరాలు మనకే మాత్రమైనా ప్రయోజన కరాలేనా అని విశ్లేషించుకుంటూ ఉండాలి. వీటి గురించి మెళుకువతో లేకపోతే మనం వాటి మాయలోనే పడిపోతాం.

వగరు అవసరమైనప్పుడు వగరు, పులుపు అవసరమైనప్పడల్లా పులుపు ఉండాలి. కానీ స్థిరంగా ఉండిపోకూడదు. పిందె పండుగా మారినట్లే మనం కూడా మృదువుగా, మధురంగా మారిపోవాలి. అలా మారితే మోక్ష ప్రాప్తి కోసం మనమేమీ ప్రయత్నం చేయనక్కరలేదు. మనం సహజ మార్గాలలో నడుస్తూ జీవిస్తున్నప్పడు ముక్తి కూడ అతి సహజంగా వస్తుంది. అలా కాక అకాలంలో బలవంతంగా (అంతఃశుద్ధి ఏర్పడక ముందే) ఏదో ప్రయత్నం చేయబోతే పక్వానికి రాకముందే పండబారిన పండులాగా రుచి లేకుండా పోతుంది. ప్రతి పని పట్లా నిర్లిప్తంగా ఇవ్వేళ ఎలా ఉన్నానో, అదే స్థితిలో ఎల్లవేళలా ఉండకూడదు. మన పాపాల సంచీ పూర్తిగా దులపకుండా బ్రహ్మజ్ఞానం కోసం పరుగులు పెట్టీ లాభం లేదు.

ఇప్పుడు కాకపోతే మరో జన్మకైనా ఆత్మజ్ఞానం పొందుతాం అన్న ఆశతో మన కర్తవ్యాల్ని నిర్వర్తిస్తూ జీవించాలి. వేదప్రోక్తమైన ధర్మాలను విషయాలు బాహ్యపు ముసుగు గురించి మాత్రమే శ్రద్ధ వహిస్తున్నాం. అంచేత ప్రస్తుతం బాహ్యాచరాలను, మతానికి సంబంధించిన గుర్తులు, ప్రతీకలతో ప్రారంభం చేద్దాం. దశలవారీగా అంతరసత్యాలు అర్థమౌతూ, అవుతూ, మధురఫలం పరిపక్వతను పొందగలం.

**లోపల - బయట**

తాతా తండ్రుల నుండి సాంప్రదాయకంగా వచ్చే ఆచారాలను, తమ వంశపారంపర్యంగా వచ్చే అలవాట్లను మానవుడు తప్పకుండా ఆచరించాలని మేమెప్పుడూ చెపుతుంటాం. తిరుమణి, రుద్రాక్ష, విభూది మొదలైన గుర్తులను ధరించాలి. కొంతమంది సచ్ఛీలం, సత్ప్రవర్తన ఉంటే చాలునని, ప్రవర్తన మనస్సుకు సంబంధించినదని, ఆచారాలు బాహ్యమైనవని భావిస్తుంటారు.

నిజం చెప్పాలంటే నీ బాహ్యమైన చేష్టలు, నీవు ధరించే గుర్తులు నీ ఆంతరంగిక జీవితంపై ప్రభావాన్ని చూపిస్తాయి. శారీరక కర్మలకూ, లోపలి భావాలకూ సంబంధం ఉంటుంది. ఈ సత్యాన్ని వివరిస్తాను. ఒకరోజు అనుకోకుండా ఒకాయనకు లాటరీలో లక్షరూపాయలొచ్చాయని తెలిసింది. అతని ఆనందానికి అవధుల్లేవు. అది అతడి శరీరంపై ప్రభావం చూపించింది. అతను ఉద్రేకపడిపోయాడు. శ్వాస ఒక్కక్షణం పాటు నిలిచిపోయి స్పృహ తప్పిపోయాడు. "ఒక ప్రత్యేకమైన భావన శ్వాసక్రియలో ఓ ప్రత్యేకమైన మార్పును తెస్తుంది. ఆచరణాత్మకమైన ఈ పరిశీలన వల్లనే యోగా ఆరోగ్యకరమైన, వివేకవంతమైన ఆలోచనలను కలిగించడానికి శ్వాసక్రియ (ప్రాణాయామాదులు)పై పాఠాలు నేర్పుతుంది. తరచుగా మన లోపలి భావాలను బాహ్యరూపం ప్రతిబింబిస్తుంది. నీవు కోపంగా ఉన్నప్పుడు





కళ్లు ఎఱ్ఱనై, పెదవులు వణుకుతాయి. నీవు విచారంగా ఉన్నప్పుడు కళ్ళు నీళ్లతో నిండి మసకబారతాయి. సంతోషంగా ఉన్నప్పుడు పళ్లికిలిస్తావు. ఇలా నీ శరీరానికీ, మనస్సుకూ ఖచ్చితమైన సంబంధం ఉంది. ఈ సత్యం మీద ఆధారపడే వివేకులైనవారు కొన్ని ఆత్మికమైన లక్షణాలను సాధించడానికి కొన్ని కొన్ని యోగ ప్రక్రియలు సూచించారు.

యూనిఫాం వేసుకోకపోతే సిపాయిలలో వీరత్వం తగ్గిపోతుందా? అవును. అందుకే విశ్వవ్యాప్తంగా సిపాయిలు యూనిఫాం తప్పక ధరిస్తారు. అవి వారిలో ధైర్యాన్నీ, పోరాట పటిమనూ నింపుతాయి.

బయట ధరించిన గుర్తులూ, ప్రదర్శించే సంస్కారాలు ఆంతర్యానికి సంస్కారాన్నిస్తాయి. ఇవి కేవలం ముసుగేనంటావా? కావచ్చు. నీవు ధరించే గుర్తులకనుగుణంగా సంప్రదాయాన్ని మన్నించాలి. అప్పడవి నిజంగా నీలో పవిత్రతను పెంచుతాయి.

నేను సంస్కారాలకు విలువ ఇవ్వడమూ, రుద్రాక్ష, విభూతి వంటివి ధరించమని చెప్పడం సహజమే. నేను మఠాధిపతిని. నేనివన్నీ వేసుకుంటేనే మీరు నా దగ్గరకు వస్తారు. మఠ నిర్వహణకు నాకు దక్షిణలిస్తారు. అంచేత నేను ధరించే దుస్తులు నాకొక ప్రయోజనాన్ని కల్గిస్తున్నాయి. కానీ మీ విషయం అలా కాదు. మీ జీవనోపాధి మీకున్నది. కనుక నాకంటే నిజాయితీతో మీరు మీ సంస్కారాలను ప్రదర్శించగలరు. ధర్మపదమైన దుస్తులను ధరిస్తూ మిమ్మల్ని మీరు పవిత్రం చేసుకోగలరు.

మనకు పరమ సత్యాన్ని గుర్తు చేసే దుస్తులు ధరిద్దాం. దుష్టత్వాన్ని దూరం చేసే ఆచారాలు పాటిద్దాం. పవిత్రమైన ప్రవర్తన, శీలం అలవరచుకొని, అంతర్యాన్ని పవిత్రీకరించుకుందాం. అటుపైన పరబ్రహ్మను గూర్చి ధ్యానించి, అనుభూతి చెంది, శాంతిని, ఆత్మానందాన్ని అనుభవిద్దాం.

❁

శ్రీ సాయిరాం

## అష్టోత్తర శత కుండాత్మక ఏకాహ్నిక

# శ్రీ దత్త శక్తి మహాయాగము

శ్రీ సాయినాథుడు ఒక విశిష్ట యోగీశ్వరుని రూపంలో కనిపించిన సంపూర్ణ దత్తావతారం. పరులను సేవించడంలోనే ముక్తిమార్గం ఉన్నదని ఆయన వాచా కర్మణా కూడా చెప్పారు. సమస్త జీవరాశులలోను నన్నే చూడండి అని ఆయన మనకు హితవు చెప్పారు. స్వయంగా తామే ఆబాల గోపాలాన్ని సేవిస్తూ గడిపారు. ఆయన భక్తులకు ఎవరికైనా ఆ విధానమే శిరోధార్యం. ఆ మార్గంలో ప్రయాణించిన శ్రీ సాయి దత్త పీఠాధిపతులు, సాయీ ప్రసన్నులు, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్, సాయిధామం, శ్రీ సాయినాథ క్షేత్రం, శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం సేవాశ్రమాల వ్యవస్థాపకులు పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహారాజు వారు. వారి దివ్య ఆశీస్సులతో, శ్రీ మాతా శుకవాణీ గారి ప్రేమాశీస్సులతో .... లోక కళ్యాణార్థం భక్తా భీష్ట సిద్ధ్యర్థం, నవగ్రహ దోష నివారణార్థం విజయ అభయ ఆయురారోగ్య ఫల సిద్ధ్యర్థం త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన శ్రీ దత్తాత్రేయ స్వామి అవతరించిన రోజున స్వస్తిశ్రీ వికారి నామ సంవత్సర మార్గశిర శుద్ధ పౌర్ణమి (దత్తాత్రేయ జయంతి) **బుధవారం తేది : 11-12-2019**న మన సాయిధామం సేవాశ్రమంలో ఏకాహ్నిక దీక్షా విధానంతో అష్టోత్తర శత కుండాత్మక శ్రీ దత్త శక్తి మహాయాగము జరుపుటకు సంకల్పించబడినది. కావున భక్తులందరూ ఈ శ్రీ దత్త శక్తి మహాయాగములో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.





## కార్యక్రమ వివరములు

**11-12-2019 బుధవారం**

ఉ.గం. 9.00ల నుండి శ్రీ విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనము, అఖండ దీప స్థాపనము, శ్రీ గురు పూజ, గోపూజ, దీక్షా ధారణము

ఉ.గం.10.00 : శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకము, షోడశోపచార పూజ

ఉ.గం.11.00 : యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, శ్రీ గణపతి హోమము, నవగ్రహ హోమము, శ్రీ దత్తాత్రేయ మూల మంత్ర గాయత్రి హోమము, దిక్పాలక బలి అనంతరం **బ్రహ్మచారి శ్రీ సాయిరామ చైతన్యగారిచే** ఆశ్రమం పరిచయం

మ.గం.1.00 : **శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలయోగి భారతి** గారిచే ప్రవచనం, జయాదులు, పూర్ణాహుతి, మహదాశీర్వచనం

మ.గం.2.00 : అన్నప్రసాద వినిమయం

పై కార్యక్రమంలో పాల్గొనే భక్తులు దక్షిణగా రూ.1,501/-లు సమర్పించవలసి ఉంటుంది. ఈ యజ్ఞ సామాగ్రి ఆశ్రమమే అందజేస్తుంది. ఎవ్వరైనను యజ్ఞంలో పాల్గొనవచ్చును. యజ్ఞంలో పాల్గొనేవారు సాంప్రదాయ దుస్తులనే ధరించాలి. పై కార్యక్రమమునకు భక్తులు అధిక సంఖ్యలో మరియు సకాలమునకు విచ్చేసి శ్రీ సాయిదత్త ప్రభు వారి కృపకు పాత్రులగుదురు గాక! ఈ కార్యక్రమానికి ఆర్థికంగాగానీ, ధన, వస్తు రూపేణాగానీ సహకారం అందించగలరు. రాలేని వారు తమ గోత్ర నామములను అందజేసిన యెడల వారి పేర్ల మీద యాగము జరిపించబడును.

సర్వేజనా సుఖినో భవంతు

**కార్యస్థలము : సాయిధామం**

**ఇట్లు**

**ధర్మాధికారి, సాయిధామం**

**వివరాలకు : సెల్ నెం. 9440413455, 984133565 సంప్రదించ వచ్చును.**

# చాలునే నిద్ర

**- శ్రీ రామకృష్ణ కథామృతం నుండి**

చాలునే నీ నిద్ర చాలునే మనసా
ఇకనెంత కాలము నిదురపోయెదవు?
మాయ కౌగిటిలోన మమతలో చిక్కి
కనుమూసి ఎన్నాళ్ళు కునుకుచుండెదవు ॥ చా ॥

ఏల పుట్టితి నీవు? ఎవరవే నీవు?
నీ రూపమనలేము మరచి పోయితివి
నీ కనులు విప్పవే ఇకనైన మనసా
చెడు కలలో నుండి వడి మేలుకొనుము ॥ చా ॥

నీయందె నిత్యమౌ ఆనందముండ
తరలిపోయెడు బయటి తళుకులకు భ్రమసి
బుద్ధిలేకను నీవె బద్ధవైనావు
వెడలి చీకటి నుండి వెలుపలికి రమ్మ ॥ చా ॥

తెలివి మాలినదాన, మలిన మానసమ !
వేగమే వెలుపలికి వెడలి రావమ్మ
ఉదయాద్రి పై నుండి ఉదయించు రవికి
చేయెత్తి వందనము చేయరావమ్మ ॥ చా ॥





# గురు కృప

**- శ్రీమతి సాధుని శాంతమ్మగారు**

నా అన్న అల్లుడికి రామనాథపురం నుంచి దగ్గర ఉన్న పల్లెటూరికి బదిలీ అయింది. భార్య పుట్టింట్లో ఉండటం వల్ల అతను ఒక్కడే వెళ్ళి వంట చేసుకోలేక నాకు కబురంపినాడు. నాకప్పుడు నలభై యేళ్ళు. వెళ్ళినా-సామాన్లన్నీ వెంట తీసుకుని, బియ్యం పొయ్యి మీద పెట్టి కూచున్నానో లేదో, ఏ కారణం లేకుండానే నాలోంచి పెద్ద ప్రశ్న బయలుదేరింది.

"ఏమిటి? నువ్వు చేస్తున్న పని! ముగ్గురు కొడుకులూ పోయినారు. భర్త పోయినాడు. కూతురికి పెండ్లి చేసి, ఆ కూతుర్ని అల్లుణ్ణి అమితంగా ప్రేమించి, నీకున్నదంతా వాళ్ళ కోసం ఖర్చు చేసినావు. ప్రసవించి పిల్లతో సహా కూతురు చచ్చింది. కూతురు పోయి ఆరు మాసాలయిందో లేదో, ఈ లోపలనే అన్న కూతుర్నీ, అల్లుణ్ణి తెచ్చుకొని రామనాథపురం రాజు గారిని యాచించి అతనికి ఉద్యోగం యిప్పించి, నీకు మిగిలినదేదో వాళ్ళిద్దరికి ఖర్చు చేస్తూ వండి పెడుతున్నావు. ఇందుకేనా నువ్వు పుట్టింది? ఎవరి మీదో ఒకరి మీద మమకారం తగిలించుకోకుండా నిలువలేవా? ఇతనెవరు? నువ్వెవరు? ఈ చాకిరికీ, ఈ ఖర్చుకి అర్థమేమిటి? ఇట్లాగే నీ కాలం గడిస్తే చివరికి నీ గతేం కాబోతుంది?" అని అడిగినారు నాలో ఎవరో.

ఒక్కసారిగా నా కళ్ళు వాస్తవానికి గట్టిగా తెరుచుకున్నాయి.

నేను వెంటనే నా అన్న అల్లుడి దగ్గరకు వెళ్ళి "నేను రామేశ్వరం బయలు దేరుతున్నాను" అన్నాను.

"ఎప్పుడు?"

"ఇప్పుడే"

"అదేమిటి"

"అది అంతే, నేను వెడుతున్నాను".

అతను ఆశ్చర్యంతో, అయిష్టంతో "నాకు తిండి ఎట్లా?" అని సణుగు కున్నాడు.

"అదంతా నాకు తెలీదు, నేను వెళుతున్నాను. పొయ్యి మీద అన్నం వుంది చూసుకో" అని ఖచ్చితంగా చెప్పి రైలెక్కినాను.

ఆ ముందురోజు అతను, అతని భార్య నా లోకం. "వాళ్ళు తిన్నారా, లేదా? వాళ్ళకి ఇష్టమయేట్టు వంట చేశానా? ఇంకా ఏం పెట్టను వాళ్ళకి?" ఇదే నా బతుకు. ఆలోచించితే వాళ్ళెవరో, నేనెవరో.

రామేశ్వరం వెళ్ళినాను. ఒకటే వేదన, "నాకు మోక్ష మార్గం ఎవరు చూపుతారు?"

అక్కడ పురాణం చదివే ఒకామె ఉంటే ఆమెకి సేవ చేస్తూ వారింట్లో వున్నాను. మొదట్లో ఆమెనడిగాను. "పరమార్థం అర్థం కావాలంటే ఏం చదవమంటా"రని. 'కైవల్యం' అనే పుస్తకం చదవమంది ఆమె. అది ఎక్కడ దొరుకుతుందంటే "నాగస్వామిగారని ఒక స్వామి వున్నారు. ఆయన్నడగ మంది. నాగస్వామి గారిని చిన్నతనం నుండి యెరుగుదును. వెళ్ళి ఆయన్ని అడిగాను.

"ఎందుకు 'కైవల్యం' నీకు?"

"అది చదివితే మోక్షమార్గం స్పష్టమౌతుందన్నారు"

"పుస్తకం చదివినంత మాత్రాన మోక్ష మార్గం తెలుస్తుందా?"

"అంతకన్న ఏం చెయ్యను స్వామీ?"

"నీకు మార్గం తెలుసుకోవాలని గట్టి కోర్కె వుందా?"

"అవును"

ఆయన నన్ను పరీక్షిస్తూ చూచినారు. "సరే, రేపు పౌర్ణమి నాడు రా!" అన్నారు.

ఆ పౌర్ణమినాడు నాకు మహామంత్రం ఉపదేశం చేసినారు. ఆ





ఉపదేశం పొందుతూ వుంటేనే, ఆయన సాక్షాత్తూ పరమేశ్వరుడివలె కన్పించినారు. ఆ మంత్రం ఉచ్ఛరించడంతోనే ఒళ్ళు తెలీక, తన్మయురాలై, ఎంతోసేపు అట్లానే కూర్చుండిపోయినాను. 'నాకు యింత సులభంగా సద్గురువు దొరికారే!' అని చాలా సంతోషమయింది. ఆనాటి నుంచి ఒక సంవత్సరం కైవల్యం చదవడమయే వరకు ఆ దంపతుల్ని సేవించుకొని ఉండిపోయినాను.

తరువాత రామనాథపురానికి వెళ్ళి లోక వ్యవహార సంబంధాలు వదలి, నేను తెలుసుకున్న వేదాంత గ్రంథాలు చదివి, వినే వారికి చెబుతూ ఆ మంత్రం జపించుకుంటూ కాలం గడుపుతున్నా.

అట్లా తొమ్మిది సంవత్సరాలు గడిచాయి. నాకు యాభై ఏళ్ళు నిండి నాయి. రామనాథపురవాసులైన మురుగనార్ (భగవాన్ శిష్యుడు) నా పఠన కాలక్షేపానికి వస్తూ ఉండేవాడు. వారి దగ్గర భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారి చిత్రపటాన్ని ఒకనాడు చూచినాను.

అప్పటి నుండి భగవాన్ దర్శనం చేసుకోవాలని గట్టి కోర్కె కలిగింది. మురుగనార్ అప్పటికే అన్నీ వదలి భగవాన్ పాదాల్ని ఆశ్రయించుకొని అరుణాచలంలో ఉంటున్నారు, నేను ఎప్పడూ బాగా బీదదాన్ని కావడం వల్ల అనుకున్నప్పడు కొంచెం దూరం ప్రయాణం చెయ్యగల సామర్థ్యం కూడా నాకు లేదు. కొంత డబ్బు సమకూర్చుకోడానికి సంవత్సరం పట్టింది. నేను మురుగనార్ గారి అక్క, మరి ఇంకా ముగ్గురు స్త్రీలు కలిసి అరుణా చలానికి బయలుదేరినాము. గంపెడాశతో అది 1927 కార్తీకమాసం.

అప్పటికే భగవాన్ కొండ దిగి వచ్చి పాలితీర్థం పక్కన తల్లి సమాధి పైన వేసిన ఒక పాకలో ఉంటున్నారు. ఆ పాక తప్ప ఇంకేమీ లేదు. చుట్టూ అడవి. మేము ఊళ్ళో ఒక అద్దె ఇంట్లో స్థిరపడినాము. మర్నాడు భగవాన్ దర్శనానికి వెళ్ళినప్పడు, వారు ఆ పాకలో ఓ నులకమంచం పైన కూచుని ఉన్నారు. పక్కన మురుగనార్ ఉన్నారు. భగవాన్‌ను చూడగానే తెలిసింది,

వారు గురు రూపంలో ఉన్న ఈశ్వరుడని. నేను తెచ్చిన పళ్ళు వారి ముందు పెట్టి నమస్కరించి, “ఎన్నాళ్లనుంచో తమ దర్శనం చేసుకోవాలనే నా కోర్కె ఈనాటికి తీరింది. ధన్యురాలనైనాను” అని చెప్పి, “స్వామీ, నాకు ఈ మనస్సు అనేది లేకుండ చేసి కటాక్షించండి” అని అడిగినాను.

దానికి స్వామీ మురుగనార్‌తో “ఆమెను కనుక్కోండి-మనస్సు అనేది ఒకటుందంటే, ఆ మనస్సు ఆకారమెటువంటిదో, ఆ మనసుగారికి మీసాలూ, గడ్డాలూ వున్నాయేమో చూడమనండి” అన్నారు.

ఆ మాటలకి ఏమి సమాధానం చెప్పాలో తెలీలేదు నాకు. మురుగనార్ నన్ను చూసి “నీకు దీక్ష అయింది” అన్నారు. రమణస్తుతి పంచకం నుంచి నేను ఒక పద్యం చదివినాను తమిళంలో, “నీవు స్వర్ణజ్యోతి స్వరూపం. నీవు సర్వపరిపూర్ణుడవు. నీవు పొందిన ఆత్మానుభూతి పరిమళము సర్వ జగత్తును ఆవరించింది. ఆ రసాన్ని ఆస్వాదించి అందరూ నీ దగ్గరకే పరుగెత్తుకొని వస్తున్నారు. నేను ఆ పరిమళాన్ని రుచి చూచి నిలవలేక ‘ఎక్కడ? నువ్వెక్కడ?’ అని వెతుక్కుంటూ వచ్చాను” అని పాడినాను.

# పెద్దపులి బారినుండి రక్షించిన బాబా

**రచన, అనువాదం : యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాద్**

అగ్రగణ్యులైన సాయి భక్తులలో కాకా సాహెబ్ దీక్షిత్ ఒకరు. న్యాయ వాదిగా ఎంతో పేరెన్నికగన్నవాడు. అన్నీ విడిచి కేవలం 45 సంవత్సరాల వయస్సులో షిరిడీ వచ్చి సాయిని సేవిస్తూ జీవితాంతం అక్కడే ఉండి పోయిన విరాగి. ఆనాడే షిరిడీ దర్శించే భక్తుల అవసరార్థం పెద్దవాడా నిర్మించాడు. అదే ఈనాడు బాబా వస్తు ప్రదర్శనశాలగా వున్న దీక్షిత్‌వాడా. అతడి గురించి ఎంత చెప్పినా తక్కువే!

ది.31.03.1915న దీక్షిత్, శాంతారాం, మోరేశ్వర్ ఫణ్సే ప్రభుత్వం వారి





పని మీద వెళ్లి తిరిగి వస్తున్నారు. అనుకోని కారణాల వలన వారు కొంచెం ఆలస్యంగా బయలుదేరారు. వారు దహాణు తాలూకాలోని అడవి మార్గం గుండా ప్రయాణించాలి. ఎడ్లబండి ఒక్కటే ఆధారం ఆ ప్రయాణానికి. అక్కడికి వచ్చేసరికి నెమ్మదిగా చీకట్లు ముసురుకున్నాయి. ఆ అటవీ ప్రాంతంలో పులులు సంచారిస్తుంటాయని చెప్పకొంటుంటారు. అందులోను అది కొండ దారి. అప్పటికే ఎడ్లు అలసిపోయి వున్నాయి.

ఎందుకోగానీ ముందుకు నడుస్తున్నా ఎడ్లబండి కొంచెం కొంచెంగా వెనకకు జారసాగింది. ఎడ్లు ముందుకు పోకుండా వెనకడుగు వేయడానికి కారణం వాళ్లకి అర్థం కాలేదు. ఇది చాలా అపాయకరమైన పరిస్థితి. రోడ్డుకి ఒక ప్రక్క లోయ. పరిశీలిస్తే రోడ్డు అంచు విరిగిపోయి ఉంది. మరొకప్రక్క కొండ. ఒకవేళ బండిగానీ ఒరిగిందంటే ఎడ్లబండితో సహా వీళ్ళు లోయలోపడి తునాతునకలయి నామరూపాలు లేకుండా పోతారు. వారి వెనుక దిగుడు దారి. అయితే ఎద్దులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నాయా అని దీక్షిత్, ఫణ్సే అన్వేషించసాగారు. ఇంతలో ఫణ్సే ముందరగా అటుపక్క చూడమని దీక్షిత్‌కు చూపుడు వ్రేలుతో చూపించాడు. దీక్షిత్‌కి ఎదురుగానున్న పొద ప్రక్కన మెరిసిపోతున్న పెద్దపులి కళ్ళు కనిపించాయి. ఇంతలో పెద్దపులి అవతల ప్రక్క బండరాళ్ళ మీదికి దుమికింది. ఎడ్లుగాని భయపడి ఏ కొంచెం ప్రక్కకు జరిగినా, బండి ఒరిగినా లోయలో పడి చనిపోవడం ఖాయం. అలాగని క్రిందికి దిగి బండి దిగజారకుండా చేద్దామంటే ఇంక చెప్పేదేముంది! పెద్దపులికి వీరు విందు భోజనమే!

ఫణ్సే కొంచెం ధైర్యసాహసాలు కలవాడు. గుండె చిక్కబట్టుకొని తన చేతిలో వున్న పగ్గాలు దీక్షిత్‌కి నెమ్మదిగా అందించాడు. క్రిందికి దిగి ఏదైనా రాయిగానీ, బండరాయిగానీ బండి చక్రాల వెనుక అడ్డుగా వుంచి బండి దిగజారకుండా చెయ్యాలని అతడి ఆలోచన. దీక్షిత్ గొంతు భయంతో

తడారిపోయింది. చేతిలో పగ్గాలున్నాయి. ఇంతలో ఒక ఎద్దయితే కాలు ముడుచుకొని కూర్చోబోతున్నట్లుగా వుంది. పురాకృత సుకృతం వల్ల అలాంటి భయానక పరిస్థితుల్లో దీక్షిత్‌కు సాయిబాబా గుర్తుకొచ్చారు. తత్‌క్షణమే, "జై శ్రీ సాయిబాబా! రక్షించండి, రక్షించండి" అని గట్టిగా అరవసాగాడు. ఫణ్సే కూడ పెద్దగొంతుకతో అరుస్తూ దీక్షిత్‌తో జత కలిశాడు. ఈ హడావుడికి పులి లేచి బండివేపు ముఖం పెట్టి వాళ్ళ కుడిచేతివైపుకు దూకి పిల్లిలాగా పారిపోయింది. పులిని చూసిన ఎడ్లు విపరీతంగా భయపడి వేగంగా పరుగెత్తటం వలన ఆ సంకటం నుంచి దీక్షిత్, శాంతారాం ఫణ్సే మరియు ఎద్దులు ముక్తులయ్యారు. ఒక్కమాట చెప్పాలంటే వాళ్ళు సాయినాథుని స్మరించినందువల్ల మాత్రమే క్షేమంగా, ప్రాణాలతో బయటపడ్డారు. లేకపోతే పులి బారినపడిన వాళ్ళు బ్రతికి బయటపడటం సంభవమా! బాబా నామానికున్న శక్తి ఎంతటిదో కదా!

31.03.1915 నా జీవితంలో మరుపురాని రోజు. నన్ను, ఫణ్సేని కాపాడి మాకు పునర్జన్మనిచ్చారు బాబా అంటాడు దీక్షిత్ తరచుగా.

జై సాయిరాం

**- దీక్షిత్ డైరీ**

శ్రీ సాయితత్వ ప్రచారానికై లక్ష్యింపబడిన మాసపత్రిక **"శ్రీ సచ్చిదానంద సద్గురు సాయివాణి"**. ఈ పత్రికకు చందాదారులుగా చేరండి. మీ మిత్రులను, సాయీ బంధువులను చందాదారులుగా చేర్పించండి. ఒక సత్కార్యంలో పాలుపంచుకోండి.

**చందా వివరాలు :**

**ద్వైవార్షిక చందా. .......... రూ॥ 200/-, ఆజీవ సభ్యత్వం....రూ॥1000/-**


మనీఆర్డర్లు, చెక్కులు దిగువ చిరునామాకు పంపించగలరు.

సాయిధామం, రామలింగంపల్లి పోస్టు, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.

**Ph : 9440413455, 9848133565**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిశోర్

**(సాయిభక్తులందరూ సాయితత్వ ప్రచారాన్ని జీవిత పరమావధిగా ఎంచుకున్న సాయిభక్త దాసగణు జీవితచరిత్రను ధారావాహికగా సాయివాణిలో ప్రచురిస్తున్నాము. సాయిభక్తులు చదివి తరించగలరని ఆశిస్తూ - - సంపాదకులు)**

1962, నవంబరు 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల ప్రాంతం! భూలోక వైకుంఠంగా ప్రసిద్ధిగాంచిన పండరీపుర క్షేత్రం భక్తజనసంద్రమైంది. "సాయినాథ్ మహారాజ్‌కీ జై" "దాసగణు మహారాజ్ కీ జై" అనే నినాదాలతో హోరెత్తిపోయింది. అందుకు కారణం, ఆధునిక మహీపతి మరియు ప్రఖ్యాత కీర్తనాకారుడు, ప్రముఖ సాయిభక్తుడు శ్రీ దాసగణు మహారాజ్ అంతిమ యాత్ర పండరీపుర వీథులలో జరుగుతోంది. ఆ పార్థివ దేహంపై ముందు అనేకమంది కీర్తనాకారులు హరి భజన చేసుకుంటూ నడవసాగారు. కొందరు సామాన్య ప్రజానీకం ఉన్నచోటనే సాష్టాంగపడి ఆ పార్థివదేహానికి నమస్కరించుకోసాగారు. అశేషజనవాహిని అశ్రు నయనాల సాక్షిగా, చంద్రభాగా నదీ తీరంలో ఆ పార్థివ దేహాన్ని విధి పూర్వకంగా అగ్నినారాయణకు ఆహుతిగా సమర్పించడం జరిగింది. మరుసటి రోజు వార్తాపత్రికలలో ఆ వార్త ఛాయాచిత్రాలతోసహా పతాక శీర్షికలలో ప్రచురించబడింది. మధ్య భారత ప్రాంతమంతా ఆ మహనీయుని పారమార్థిక సేవలను కొనియాడుతూ, ఆయన మరణానికి దుఃఖిస్తూ ఎన్నో సంతాప సభలు జరిగాయి. దాసగణు పరంపరకు చెందిన ఎందరో కీర్తనాకారులు ఆయన పేరుతో మహారాష్ట్ర ప్రాంతమంతా కీర్తనలను గావించారు. మధ్య భారత ప్రాంతంలో కీర్తనాశైలిలో నూతన

ఒరవడులు సృష్టించి, మహాత్ముల చరితామృతాన్ని పదకవితలో పొందు పరచి నొసంగిన ఆ మహనీయుడు భక్తుల హృదయాలలో ఆచంద్ర తారార్కం అజరామరుడై వశిస్తాడని ఆ సందర్భంగా కొందరు భక్తులు వ్యాఖ్యానించారు. ధన్యజీవి అని వెనోళ్ల కొనియాడారు. ఒక సాధారణ పోలీసు సిపాయిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన గణపతిరావు, ప్రజాబాహు ళ్యంలో అంతటి పూజ్యనీయులుగా ఎదిగిన వైనాన్ని, ఇక వివరంగా తెలుసు కునే ప్రయత్నం చేద్దాం! సావధానతతో ఉద్యుక్తమవమని ప్రార్థన!

**జననం :**

శ్రీ దాసగణు మహారాజ్ 1867వ సంవత్సరంలో నగర్‌లోని ప్రఖ్యాత సహస్రబుద్ధే వంశంలో పుష్యశుద్ధ ఏకాదశినాడు "అకోళ్‌నేర్" గ్రామంలో శ్రీ దత్తాత్రేయ సహస్రబుద్ధే మరియు సావిత్రిబాయి దంపతులకు జన్మించారు.

**నామకరణం :**

మొట్టమొదట శ్రీ దాసగణుకు "నారాయణ" అని తల్లిగారి పుట్టింట్లో నామకరణం చేశారు. కానీ, సుమారు నాలుగు నెలల వయసులో తండ్రి గారి ఇంటికి తీసుకువచ్చినప్పడు తాతగారు శ్రీ ఏక్‌నాథ్ సహస్రబుద్దేగారు, మనవడి యొక్క పెద్ద పొట్ట, పెద్ద చెవులు వంటి వాటిని చూసి "అరే! తనకు నారాయణ అని ఎందుకు పేరు పెట్టారు? చూడండి ఆ పొట్ట, చెవులు అచ్చు బాల గణపతిలాగా ఉన్నాడు. తనకు గణపతి అని పేరు పెడదాం. ఆ పేరే తనకు చక్కగా సరిపోతుంది" అని చెప్పారు. అప్పడు గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్ధేగా నామకరణం చేయడం జరిగింది.

**బాల్యం-శిక్షణ :**

తమ పెద్ద కుమారుని ప్రథమ సంతానం కావడం వలన మరియు ఇంట్లో మొట్టమొదటి చిన్న పిల్లవాడు కావడం వలన తాతగారు ఏకనాథ పంత్ మరియు నానమ్మ సరస్వతీబాయి మనవడిని అతిగారాబం చేసే





వారు. ఎంత గారాబం అంటే పిల్లవానికి 6, 7 సంవత్సరాలు వచ్చే వరకు కూడా బడికి పంపించలేదు. "చిన్న పిల్లవాడు ఆడుకోనివ్వండి, ముందు ముందు చదువుకుంటాడులే" అని అంటూ తెగగారాలు చేసేవారు. నగర్‌లో వారింటి దగ్గరే ఒక విఠల మందిరం ఉండేది. ఆ విఠల మందిరం శ్రీ దాసగణుకి అత్యంత ప్రీతిపాత్రమైన ఆటస్థలం! ఎప్పడూ నలుగురైదు గురు స్నేహితులతో కలిసి ఆ మందిరంలో ఆడుకుంటూ కాలం గడిపేవాడు.

ఆ రోజులలో మామ్లేదార్ ఉద్యోగం సహస్రబుద్ధే వంశ పారంపర్యంగా ఉండేది. శ్రీ ఏకనాథ్ పంత్ మామ్లేదార్‌గా సేవానివృత్తి చెందాక, ఆ ఉద్యోగాన్ని ఆయన ద్వితీయ కుమారుడు శ్రీ జనార్దన్ పంత్-పెద్ద కుమారుడు శ్రీ దత్తాత్రేయ పంత్ కాంట్రాక్టర్ మరియు వ్యవసాయ వృత్తిలో ఉండటం వలన-మామ్లేదార్ బాధ్యతలను స్వీకరించారు.

శ్రీ దాసగణుకు తొమ్మిదేళ్ల వయస్సులో శాస్త్రోక్తంగా ఉపనయనం జరిగిన తరువాత, తరువాతి తరంలో దాసగణుని మామ్లేదార్‌ని చేయా లని, ఇంకా బాగా చదువులో శ్రద్ధ చూపిస్తే ఉన్నత చదువులకు విదేశాలకు పంపించాలనే ఉద్దేశ్యంతో పినతండ్రి జనార్దన్‌పంత్ దాసగణుని ఆంగ్ల మాధ్యమంలో శిక్షణకై బడిలో చేర్పించారు. కానీ, ఏ బాదరబందీ లేకుండా స్నేహితులతో ఆటపాటలతో గడిపే దాసగణుకు చదువు పట్ల అసలు ధ్యాసే ఉండేది కాదు. ఎప్పడూ తనకు తన ఆటస్థలమైన విఠల మందిరమే గుర్తుకు వచ్చేది. ప్రతి సంవత్సరం అతి కష్టం మీద గట్టెక్కుతూ చివరకు 16 ఏళ్ల వయస్సులో ఆంగ్లమాధ్యమంలో మూడవ తరగతి (ప్రస్తుత విధానాన్ని అనుసరించి 8వ తరగతి) చేరుకున్నాడు. కానీ, తాతగారి గారాబంలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. "చదువులో ఎక్కి రాకపోతే ఎలా?" అని ఎవరైనా అడిగితే "నా మనుమడు ఖచ్చితంగా చాలా గొప్పవాడు అవుతాడు. ఎంతో కీర్తిప్రతిష్టలు అర్జిస్తాడు" అని శ్రీ ఏకనాథ్ పంత్ ఎంతో విశ్వాసంతో చెప్పేవారు.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి జరుపుకుంటారు. ఈ పండుగ ప్రతియేట ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపావళి పండుగ ముందురోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి. దీన్నే నరక చతుర్దశిగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం అక్టోబర్ 26, 27వ తేదీన వచ్చింది. సాయిధామంలో ఈ పర్వదినానికి రెండు రోజుల ముందునుంచే ఇళ్లు, వాకిళ్ళు శుభ్రం చేసుకొని, అటకల మీద ఉన్న టపాకాయలు బూజు దులిపి ఎండబెట్టుకున్నారు పిల్లలు. ఉదయం 6 గం.లకు ద్వారవతిలో బాబా వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిగాయి.

సాయంత్రం ఆశ్రమంలో సాయి దేవాలయంలో దీపాలంలకరణ ఎంతో సుందరంగా జరిగింది. దేవాలయాన్ని రంగు రంగుల రంగవల్లికలతో అలంకరించి, వాటి మధ్య దీపాలు కొత్త కాంతులతో శోభాయమానంగా వెలిగాయి. సాయంత్రం 6 గం.లకు హారతి అనంతరం లక్ష్మీదేవి పూజ, గురుదేవుల పరమ గురువుల తిథి కావడంతో వారికి సాయిరామ చైతన్యగారు పూజ నిర్వహించారు.

ఈసారి ఆశ్రమంలో చిన్న పిల్లలు ఎక్కువ అవడంతో గురువుగారు టపాకాయలు ఎప్పుడిస్తారు? మేము ఎప్పుడు కాల్చాలి అనే ఉత్సాహం ఎక్కువైంది. పూజానంతరం పిల్లలందరికీ టపాకాయలు కాల్చడంలో





మునిగిపోయారు. గురువుగారు, మాతాజీగార్లతో అనుబంధం ఉన్న పెద్ద పిల్లలు మాత్రం వారిని స్మరించుకొని బాధపడ్డారు.

అన్ని మాసాలలోకెల్లా కార్తీక మాసం పవిత్రమైనది. కార్తీక మాసంలో పౌర్ణమి రోజు చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ కార్తీక పౌర్ణమి అనేది హరిహరులకు అత్యంత ప్రీతికరమైనది. మానవాళికి వారిద్దరినీ కొలిచి తరిస్తే వారి శుభ అనుగ్రహం పొందడానికి తగిన మాసమని పురాణాలు చెప్తున్నాయి.

నవంబర్ 12 - సాయిధామంలో కార్తీక పౌర్ణమి భక్తి ప్రపత్తులతో చక్కగా జరిగింది. ఉదయాన్నే కార్తీక స్నానాలతో మొదలై బాబా వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజ, ఉసిరి చెట్టుకు పూజ, 365 వత్తుల దీపాలంకరణ, శివస్తుతి, సాయంత్రం ఉపవాసాల విరమణ, పూజ, దేవాలయం దీపాలంకరణ మొదలైన కార్యక్రమాలతో ఆనందంగా, ఉత్సాహంగా గడిచిపోయింది.

## శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి

అక్టోబరు 29వ తేదీ కార్తీక మాసారంభం సందర్భంగా ఆశ్రమంలో భక్తుల సౌకర్యార్థం రావి, ఉసిరి, జమ్మి వృక్షాల దగ్గర శుభ్రం చేసి, దీపారాధన చేయుటకు వీలుగా ఏర్పాటు చేసాము. కార్తీక మాసంలో ఆశ్రమ పరిసరాలలోని భక్తులు, సత్తెనపల్లిలోని భక్తులు వేకువనే వచ్చి దీపాలు వెలిగించి, దైవ దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. పాడ్యమి రోజు వేకువనే భక్తులు వెలిగించిన దీపాల కాంతితో ఆశ్రమ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

నవంబరు 9వ తేదీ క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా బాబా మందిరం వెనుక ఉన్న తులసీ సమేత ఉసిరి చెట్టు దగ్గర తులసీ దామోదర పూజా కార్యక్రమం నిర్వహించాము. ముందుగా తెలియచేయడం ద్వారా ఆశ్రమ పరిసరాలలో ఉన్న భక్తులు పూజా కార్యక్రమానికి తరలివచ్చారు. శ్రీ మహా

విష్ణువు యోగ నిద్ర నుండి మేల్కొని బృందావనానికి (తులసీ వనం) వస్తారు. ఆ సందర్భంలో దీపాలు వెలిగించి తులసీ దామోదర పూజ చేసుకోవడం ఎంతో పుణ్యప్రదం అని పూజారిగారు వివరించి, వచ్చిన భక్తుల చేత శాస్త్రోక్తంగా పూజ చేయించారు. భక్తులు తులసీ ఉసిరి చెట్టు చుట్టూ అలంకరణ చేసి తులసీ దామోదరులను పూలమాలాలంకృతులను కావించి చుట్టూ దీపాలు వెలిగించారు. దీప కాంతితో పరిసరాలన్నీ శోభాయమానంగా వెలుగొందినవి. సాక్షాత్ స్వామి ఉసిరి వృక్షంలో కొలువై ఉన్నారని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజ నిర్వహించి తులసీ దామోదరుల కృపకు పాత్రులయ్యారు. అనంతరం పూజారిగారు కార్తీక పురాణంలో ఒక అధ్యాయాన్ని భక్తులకు చదివి వినిపించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణతో కార్యక్రమం ముగిసినది.

12వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో కొలువై వున్న సీతారామ చంద్రులకు, ఆనంద సాయి ప్రభు వారికి పంచామృత క్షీరాభిషేక, జలాభిషేకాలు జరిగినవి. వచ్చిన భక్తులు స్వయంగా బాబా వారికి అభిషేకం చేసి తరించారు. అనంతరం పూజా కార్యక్రమం జరిగినది. ఉదయం 10 గం.లకు కోరిన కోరికలు, అనంతశుభాలను కలుగజేసే సామూహిక సాయినాథ వ్రతం వైభవోపేతంగా జరిగినది. వచ్చిన భక్తులు తమ మనోభీష్టాలు నెరవేర్చాలని సాయినాథుని మనసులో వేడుకొన్నారు. అనంతరం వ్రత ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసినది. సాయంత్రం 6 గం.లకు ఆశ్రమ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమం వైభవోపేతంగా జరిగినది. ముందుగా ఏర్పాటు చేసిన శివలింగం, ఓంకారం, స్వస్తిక్ అలంకారాలలో దీపాలను ఉంచి పూలతో అలంకరించి, వచ్చిన భక్తులందరిచేత కార్తీక దీపాలను ఒక్కసారిగా వెలిగించారు. భక్తులు వెలిగించిన దీపాల కాంతితో ఆశ్రమ ప్రాంగణమంతా దేదీప్యమానంగా వెలుగొందినది. ఆ దృశ్యం పరమపూజ్య గురుదేవులు, భక్తులలో వెలిగించిన జ్ఞానజ్యోతుల





కాంతిగా శోభిల్లినది. భక్తులు ఆనందోత్సాహాలతో దీపాలను వెలిగించి అనంతరం ఆశ్రమంలో కొలువుదీరిన మూలవిరాట్ శ్రీ సీతా సమేత శ్రీ కోదండ రాముల వారిని, ఆనంద సాయి ప్రభు వారిని, శ్రీ ఆంజనేయ స్వామి వారిని, పరమపూజ్య గురుదేవులను దర్శించి తరించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణతో కార్యక్రమం నిర్విఘ్నంగా ముగిసినది. ఈ కార్యక్రమంలో పాలు పంచుకొని దీపాలను ఏర్పాటు చేయడంలో సహకరించిన చిన్నారులకు, దీపోత్సవ కార్యక్రమానికి నూనె, ప్రమిదలను అందించిన భక్తులకు గురుదేవులు, సాయిబాబా వారి ఆశీస్సులు.

# సత్సాంగత్యం

## సత్సాంగత్యపు ఆవశ్యకత

అన్ని మతాలూ సత్సాంగత్యపు (అంటే మహనీయులతో సహవాసం) ఆవశ్యకతను గురించి చాటి చెప్పాయి. ఆధ్యాత్మిక జీవితం ప్రారంభ దశలో మొదటి మెట్టు మీద ఉన్నవారు పురోభివృద్ధిని సాధించడానికి ఇది చాలా అవసరం కూడా. అందువలన భారతదేశంలోని పారమార్థిక సాధకులందరూ సత్సాంగత్యాన్ని కావాలని అభిలషిస్తారు. దీనివలన ప్రయోజనం ఏమిటి? శ్రీరామకృష్ణ కథామృతంలో ఇలా వివరించబడింది :

**ఒక భక్తుడు :** మరి మాకు మార్గం సెలవీయండి?

**గురుదేవులు :** రోగవిముక్తికి వైద్యసహాయం అవసరం. అలాగే ప్రార్థన, సత్సాంగత్యం ఆధ్యాత్మికతకు ఆవశ్యకాలు. కానీ, ఒకటి రెండు రోజుల సత్సాంగత్యం సరిపోదు. దీర్ఘకాలిక రోగం పూర్తిగా నయమయ్యేదాకా మందులు వాడినట్లు, పారమార్థికత అబ్బేదాకా సత్సాంగత్యాన్ని చేయాలి. నాడిని బట్టి రోగనిర్ధారణ చేయడం నేర్చుకోవాలంటే వైద్యునితో కొంత కాలం నివసించడం అవసరం కదా. వైద్యునితో సన్నిహితంగా మెలుగుతూ, వాత, పిత్త, కఫ దోషాలను నాడిద్వారా పసికట్టడాన్ని తెలుసుకోవాలి.

**ఒక భక్తుడు :** సత్సాంగత్యం ఒనగూర్చే మంచి ఏమిటి?

**గురుదేవులు :** అది భగవంతుని మీద వ్యాకులతను, ప్రేమను పెంపొందిస్తుంది. సత్సాంగత్యంలో దీర్ఘకాలం ఉండడం వలన మనలోని జీవాత్మ పరమాత్మ కోసం తహతహలాడడం ప్రారంభిస్తుంది. మరొక లాభం కూడా ఉంది. మంచి, చెడులను తెలియజెప్పే నిత్యానిత్య విచక్షణను అలవరుస్తుంది. భగవంతుడు ఒక్కడే శాశ్వతుడు (ఎల్లప్పుడూ ఉండేవాడు), ఈ ప్రపంచం అశాశ్వతం (ఎప్పుడూ మారుతూ ఉండేది) అని మనకి విశ్వాసం కలిగేలా చేస్తుంది. మరోలా చెప్పాలంటే మనలోని వైరాగ్య భావనలను సత్సాంగత్యం పెంచుతుంది. సర్వాన్ని త్యజించిన మహనీయుల వలన ఇతరులు వైరాగ్యం యొక్క విలువను తెలుసుకుని, దాన్ని పాటించేందుకు కావలసిన ప్రేరణను పొందుతారు. ఒక కథలో ఒక ఇస్లాం మతానికి చెందిన మహాత్ముణ్ణి ఒక సుల్తాను దర్శిస్తాడు. సుల్తాను ఆ మహాత్ముడి వైరాగ్య జీవనాన్ని పొగడ్తలతో ముంచెత్తుతాడు. సమాధానంగా ఆ మహనీయుడు, "నా వైరాగ్యంతో పోలిస్తే మీ వైరాగ్యమే మరింత గొప్పది! ప్రాపంచిక భోగాలను మాత్రమే నేను త్యజించాను. కానీ, మీరు భగవంతుణ్ణి, నిర్వాణ సుఖాన్ని కూడా త్యజించారు!" అన్నాడు.

సత్సాంగత్యం లేదా సరైన దృక్పథం కలవారి సాంగత్యం గురించి కొంత అవగాహన అవసరం. బుద్ధుడు చెప్పిన 'సమ్యక్ దృష్టి'కీ, వేదాంత సాధనకూ, సత్సాంగత్యానికీ ఎంతో సంబంధం ఉంది. సత్సాంగత్యం అంటే గర్వంతో అందరికీ దూరంగా ఉండటం, సున్నితమైన భావనలు లేని జడత్వం, జాలి లేకుండా నిర్దయగా ఉండడం కానే కాదు. పైకి అందరితో లేదా కొందరితో కలవకుండా విడిగా ఉన్నట్లు కనిపిస్తున్నా, లోలోపల జాలి గుండె కలిగి ఉండడమే దీని అర్థం. బౌద్ధమతం యొక్క నియమాలలో, సన్యాసజీవితంలో ఉంటున్నా సర్వప్రాణి కోటికీ దయ చూపడం అనేది ముఖ్యమైనది. సహప్రయాణీకులు ఒకరికి ఒకరు సహాయం చేసుకోవచ్చు. అందువలనే సత్సాంగత్యానికి అంత ప్రాముఖ్యం లభించింది. పరస్పర



సాయి వాణి

సహాయం, పరస్పర సానుభూతి అవసరం; మన భారాన్ని, శ్రమను పంచుకోవడం మంచిదే. మనం గురువులుగా వ్యవహరించేకంటే సహవిద్యార్థులుగా మెలగాలి. వీలైనంత వరకూ ఇతరులకు సహాయం చేయాలి. చేతనయితే మన హద్దులలో మనం ఉండడం చాలా మంచిది. అప్పుడు మన వలన మనకు, ఇతరులకు ప్రమాదం ఉండదు, మనలో 'అహంకారం', 'నేనే గొప్ప' అనే భావనలు మొగ్గ తొడగకుండా ఉంటాయి. దీని వలన మనకూ, ఇతరులకూ కూడా ఏ హానీ ఉండదు.

"అమ్మా! నేను రథాన్ని! నీవు రథసారథివి!" అన్న వైఖరి ఎంతో మంచిది. మనం తోటి వారి కంటే అధికులం అన్న భావన కంటే, భగవంతుని సేవకులం అని భావించడం ఎంతో మెరుగు. ఇతరులకు త్రోవ చూపించబోయే ముందు, వారికి అంకితభావంతో సేవ చేయడం నేర్చుకోవాలి. సరైన శిక్షణ లేకుండానే ఇతరులకు మార్గనిర్దేశం చేయకూడదు. తగిన మూల్యం చెల్లించకుండానే ఫలాన్ని అనుభవించాలన్న కోరిక మంచిది కాదు కదా! భక్తుల సముదాయం చిన్నదైతే, అందరూ ఒకే విధమైన ప్రవృత్తి కలవారు కావడానికి అవకాశాలు హెచ్చు. ఇవ్వబడిన సూచనలు అందరికీ వర్తిస్తాయి. బృందంలోని సభ్యులందరూ ఆధ్యాత్మికంగా ప్రారంభ స్థాయిలోనే ఉన్నా పరోక్షంగా ఒకరినొకరు నిందించుకోవడం వంటివి తక్కువగా ఉంటాయి. నిజమైన సానుభూతితో, సమభావంతో అందరూ మెలుగుతారు. మొదట్లో అందరినీ ఒకే తాటిపైకి తెచ్చే పనిని చేపట్టి, తర్వాత క్రమంగా విస్తృతపరచాలి. ఏ దేశంలోనైనా పవిత్రత, భక్తి, సేవ మొదలైన గుణాలు కలిగి, అత్యున్నతమైన ఆదర్శం కోసం నిజాయితీగా పరిశ్రమిస్తూ, దానికోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేసి, ఎన్ని రకాల కష్టాలనైనా ఎదుర్కో గలిగే ధీరులైన మనుష్యుల అవసరం ఎంతైనా ఉంది. మనం ఎంత ప్రయత్నించినా, మొత్తం సామాన్య ప్రజానీకాన్ని ఆధ్యాత్మికత వైపు నడిపించ లేము. తగిన సమయం ఆసన్నమై, పారమార్థికతను అందుకోవడానికి సిద్ధంగా ఉన్న కొద్దిమందికి మాత్రమే మనం త్రోవ చూపగలము.